
ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024



నేటి నుంచి జిల్లాస్థాయి 'ఆడుదాం-ఆంధ్ర'

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం నుంచి ఫిబ్రవరి 5వరకు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. బుధవారం మహిళలకు క్రికెట్, పురుషులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. అలాగే మహిళలు, పురుషులకు బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. అలాగే గురువారం పురుషులకు క్రికెట్, మహిళలకు బడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 2న క్రికెట్ పురుషుల ఫైనల్స్, మూడో స్థానం పోటీ ఉంటుందన్నారు. అలాగే క్రీడాకారులకు భోజన వసతి కల్పించనున్నట్టు పేర్కొన్నారు.

డిఎస్‌సి ఉన్నట్టా..లేనట్టా!

ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఇదిగో అదిగో అంటూ గత కొద్దినెలలుగా ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామంటూ ఇచ్చిన మాటనూ ప్రభుత్వం తప్పింది. ఎన్నికల నేపథ్యంలో చివరి సంవత్సరంలోనైనా నోటిఫికేషన్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలింది. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సైతం నోటిఫికేషన్ ఇస్తున్నామంటూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం వైపు నుంచి మాత్రం ఎటువంటి ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో నోటిఫికేషన్ వస్తుందా? లేదా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

- నోటిఫికేషన్‌పై అభ్యర్థుల్లో ఆందోళన
- జిల్లా నుంచి ప్రతిపాదనలే పంపని విద్యాశాఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 18 వరకు బిఇడి కళాశాలలు ఉన్నాయి. కోర్సు రెండేళ్ల కాలపరిమితి కావడంతో ప్రతి రెండేళ్లకు సుమారు 900 మంది రిలీవ్ అవుతున్నారు. మరో వైపు డైట్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కాలేజ్,ప్రైవేటు కాలేజీలు 8వరకు ఉన్నాయి. ఈ కాలేజీ ల నుంచి 800మంది వరకు రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలు రానివారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరి సారిగా నోటిఫికేషన్ వెలువడింది. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు జరగలేదు. దీంతో వేలాది మంది నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నా ఆ వైపుగా అడుగులు మాత్రం పడటం లేదు. నోటిఫికేషన్ కోసం జిల్లాల నుంచి వివరాలు సైతం తీసుకోలేదని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఏడాదిన్నర కిందట అధికారులు పంపిన వివరాలు మినహా కొత్తగా ఏమీ పంపలేదని తెలుస్తోంది. దీంతో డిఎస్‌సి నోటిఫికేషన్ మాట ఉత్తదే అనే చర్చ జరుగుతోంది.

కొత్త ఉద్యోగాల భర్తీ వద్దంటూ ప్రత్యేక ఆదేశాలు

ఉద్యోగాల భర్తీపై ఆర్థికశాఖ ఇటీవల జారీ చేసిన ఆదేశాలు నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఏ ప్రభుత్వ శాఖలోనూ ప్రస్తుతం కొత్తగా ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు పంపొద్దని సూచించినట్లు తెలిసింది. పోస్టుల అప్ గ్రేడేషన్, కొత్త పోస్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. చివరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సైతం నియమించొద్దంటూ ఉత్తర్వులు వెలువరించింది. ఈ నేపథ్యంలో డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదని విద్యాశాఖకు చెందిన అధికారులు అభిప్రాయపడుతున్నారు. నోటిఫికేషన్ ఇస్తామని ఊరించి ప్రభుత్వం తమను మోసం చేసిందంటూ పలువురు నిరుద్యోగ అభ్యర్థులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికలు వస్తుండటంతో నిరుద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చడానికే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నోటిఫికేషన్ ప్రకటనలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు.

నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ

ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేకపోవడంతో నిరుద్యోగుల్లో తీవ్రనిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. సుమారు ఆరేళ్లగా డిఎస్‌సి నోటిఫికేషన్ లేకపోవడంతో బిఇడి, డిఇడి కోర్సులు చేసిన వారు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా చేరిపోయారు.కొంతమంది ప్రయివేట్ ఉద్యోగాల్లో కుదురుకున్నారు. మరికొంతమంది వాలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. విద్యాశాఖ మంత్రి గత కొద్ది నెలలుగా డిఎస్‌సికి సంబంధించి ప్రకటనలు చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల అంతా ప్రిపరేషన్ మొదలు పెట్టేశారు. తాజాగా టెట్ నోటిఫికేషన్ రావడంతో ఆశలు చిగురించాయి. అయినా ఎన్నికల నోటిఫికేషన్ మరి కొద్ది రోజుల్లో రానుండడంతో డిఎస్‌సి నోటిఫికేషన్‌పై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అయినా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తారనే నమ్మకంతో వేలాదిమంది విజయనగరం జిల్లా కేంద్రంలో అద్దె రూములో,కోచింగ్ సెంటర్లో చేరి చదువుతున్నారు.లక్షలు రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం తీరు చూసి ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల క్రితం డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరుద్యోగులు ఆందోళనలు చేపట్టారు.

జిల్లాలో ఖాళీలు లేవు

ఉమ్మడి జిల్లాలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా ఖాళీల లేవు. గత సారి జరిగిన బదిలీలు తర్వాత జిల్లా విద్యా శాఖ అధికారులు జిల్లాలో ఎటువంటి ఖాళీలు లేవని అదనపు టీచర్లను చూపించారు. కొత్త డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చినా ఉపాధ్యాయ ఖాళీలు లేకపోవడంతో కొత్త పోస్టులు సృష్టించి ఇవ్వాలి తప్ప ఖాళీలు లేవని విద్యా శాఖ అధికారులను చెబుతున్నారు. ప్రభుత్వం కేవలం ఎన్నికల కోసం డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ డ్రామాలు ఆడుతున్నారని డిఎస్‌సి అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోట జంక్షన్ వద్ద బైఠాయించిన నిరుద్యోగులు



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

జిఒ3ను పునరుద్ధరించిన వారికే ఓటు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -కలెక్టరేట్

జిఒ 3ను పునరుద్ధరించిన వారికే తాము మద్దతు తెలిపి ఓటేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గిరిజన విద్యారంగంలోని సమస్యలు పట్ల ఉపాధ్యాయ, విద్యార్థి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 8.98 శాతం గిరిజనులున్నప్పటికీ జిఒ 3ను సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, ఇప్పటికీ ప్రభుత్వాలు ఈ జీవో పునరుద్ధరణకు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని విమర్శించారు. జిఒ 3పునరుద్ధరణతోనే ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ ప్రజలకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, కావున ఈ జిఒను పునరుద్ధరించిన వారికే తమ ఓటు అని పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం గిరిజన విద్యారంగంలో జిఒ117ను ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తుందని, ఇదివరకే పాఠశాల విద్యారంగంలో ఈ జిఒ అమలు ద్వారా చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కావున ఆశ్రమ, గిరిజన పాఠశాలల్లో జిఒ 177ను అమలు చేయరాదని డిమాండ్ చేశారు. సవర భాషా వాలంటీర్లకు 10 నెలల జీతాలు చెల్లించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సిఆర్టి ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని, రోజుకు 100 రూపాయల మెస్ ఛార్జిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్రావు మాట్లాడుతూ సవర భాష వాలంటీర్లను మార్చి, ఏప్రిల్‌లోనూ కొనసాగించాలని, హెచ్ఎం, ఎస్ఎ ప్రమోషన్ వెంటనే ఇవ్వాలని, జాతపు, గదబా భాష వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు టి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని, ప్రతి జిపిఎస్ పాఠశాలకు ఇద్దరూ ఎస్‌జిటిల నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ డిడికి వినతిపత్రం అందజేశారు, సమస్యలపై స్పందించిన డిడి మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హెచ్ఎం, ఎస్ఎ ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహిస్తామని, అక్రమ డిప్యూటేషన్లకు తావు లేకుండా డిప్యూటేషన్లన్నీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని, విధాన పరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల జిల్లా నాయకులు కె.భాస్కరరావు, పి.వెంకటనాయుడు, రాజు, సింహాచలం, అవినాష్, రాము, రమణ, సవర భాష వాలంటీర్ల జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సవర భాష వాలంటీర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం ఐటిడిఎ వారు కురుపాంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపాన ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ పాల్గొన్నారు. ఐటిడిఎ ద్వారా పార్వతీపురం తర్వాత ఏర్పాటు చేసిన రెండో బంక్ ఇది. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన యువతకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ బంక్ ఈ ప్రాంత అవసరాలను తీరుస్తుందని తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

అనంతరం కలెక్టర్ తన పర్యటనలో పార్వతీపురం మండలం కొత్తవలస, జియ్యమ్మవలస మండలం తాళ్లగుమ్మ వద్ద గ్రామ సచివాలయం స్థాయిలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్, ఎంపిపి పద్మావతి, జెడ్పిటిసి సుజాత, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి వి.బంగారు నాయుడు, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, వైసిపి నాయకులు షేక్ నూరేళ్ల, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మలి జాతరకూ పోటెత్తిన జనం

యాత్రికులతో కిటకిటలాడిన ఆలయాలు

ప్రజాశక్తి - మక్కువ

ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. మంగళవారం స్థానిక వనంగుడి, చదురు గుడుల వద్ద పెద్దసంఖ్యలో భక్తులు క్యూలైన్‌లో బార్లు తీరారు. మొదటి వారం కంటే మారుజాతరకే భక్తులు పాల్గొని తొలి జాతరను మరిపించారని పలువురు విశ్లేషించారు. జాతర సందర్భంగా సాలూరు సిఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మక్కువ ఎస్ఐ నరసింహమూర్తి రెండు ఆలయాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు చక్కదిద్దారు. గతవారం జాతరకు వాతావరణంలో మబ్బులు ఏర్పడగా ఈసారి జాతరకు వచ్చే భక్తులకు ఎండ తీవ్రత తప్పలేదు. వనంగుడి వద్ద ఎండలోనే ఎక్కువ శాతం భక్తులు బారులు తీరాల్సి వచ్చింది. కింద సిమెంట్ రోడ్డు పైన ఏకధాటిగా ఎండ తగలడంతో భక్తులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఆలయం క్యూలైన్ పొడవునా టెంట్లు వేసి ఉంటే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వనం గుడి వెనుక భాగంలో ఉన్న వేప చెట్టుకు పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ దీపదూపాలు ఈ సందర్భంగా సమర్పించుకున్నారు. దేవాదాయ శాఖ అమ్మవారిని దర్శించుకుని వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రసాదాలను అందజేశారు. సిసి ఫుటేజ్‌ను పరిశీలిస్తూ క్యూలైన్లోని ఎక్కడా ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు ఇఒ వివి సూర్యనారాయణ చేపట్టారు. మారుజాతర ప్రశాంతంగా ముగియడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు.



శంబరలో మలిజాతరకు పోటెత్తిన యాత్రికులు



ఘటం తీసుకెళ్తున్న మహిళ

జనసేన ఆధ్వర్యంలో పులిహోరా, వాటర్ ప్యాకెట్లు

జాతరకు వచ్చే భక్తులకు జనసేన సాలూరు నియోజకవర్గం, నాయకులు రిసివర్ధన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత పులిహోరా, వాటర్ ప్యాకెట్లను మక్కువ- శంబర రహదారి మార్గంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు వి సుగుణేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

రోడ్లు, వంతెనలతోనే ఏజెన్సీ అభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మోదిగ, కేసలి పంచాయతీల్లో 9 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కోసం కుంతాం నుండి కాట్రగుడ్డి వరకు రూ.5 కోట్ల 40లక్షలతో 6.7 కిలోమీటర్లు నిర్మించిన బీటీ రోడ్డును, అలాగే రెండు కోట్లతో నిర్మించిన వంతెనను మంగళవారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రారంభించారు. అలాగే కాట్రగుడ్డి వద్ద రూ.5 కోట్ల 75 లక్షలతో వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అడారిపాడు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ రహదారి వంతెనల నిర్మాణంతో గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. అలాగే మారుమూల గ్రామాల రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రహదార్లు, వంతెనలు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అభ్యంతరాలు వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వాటి అనుమతుల కోసం మూడేళ్లు కేంద్ర, రాష్ట్ర కార్యాలయాల చుట్టూ తిరిగి అనుమతులు తెచ్చి కాంట్రాక్టర్‌ను బతిమాలి రోడ్డు వంతెనలు పనులు పూర్తి చేయించానని తెలిపారు. పూర్తయిన రోడ్డు మీద నుండి నడిచి వస్తుంటే తనకు ఎంతో ఆనందాన్ని కలిగిందన్నారు. రోడ్డు నిర్మాణంతో అరకుకు ప్రయాణం సులభం అవుతుందని ఒడిశా, చత్తీష్‌గఢ్ రాష్ట్ర వాసుల రాకపోకలతో ఈ ప్రాంతమంతా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానన్నారు. మండలంలో పది రోజుల వ్యవధిలో సుమారు రూ.50 కోట్లతో వంతెనలు, రోడ్లు ప్రారంభాలు, శంకుస్థాపనలు చేశామని తెలిపారు. అలాగే ప్రతి గిరిజన గ్రామాల్లో తాగునీరు సౌకర్యం కల్పించామన్నారు. గతంలో రేషన్ తీసుకునేందుకు సుమారు 15 కిలోమీటర్లు వెళ్లే వారిని, కిలోమీటర్లోపు రేషన్ డిపోను ఏర్పాటు చేశామని తెలిపారు. టిడిపి నాయకులు గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పట్టించుకోలేదన్నారు. ఐదేళ్లకొకసారి ఎన్నికల సమయంలో గ్రామాల్లోకి వచ్చి కల్లబొల్లి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి ఓట్లు అడుగుతారని అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల సర్పంచులు మజ్జి సావిత్రి, ఎస్.నిర్మల, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, కె.రవీంద్ర, ఎంపిటిసి సభ్యులు, వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, నాయకులు డి.బాబ్జీ, పి.వీరంనాయుడు, టి.గౌరీశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - పార్వతీపురం

మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించారు. జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని తెలిపారు. తన తుది శ్వాస వరకు శాంతి, అహింసా మార్గాలను ప్రచారం చేశారన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలని కోరుకున్నారని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాలు స్వయంసవృద్ధి సాధించాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను మనం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, కెకెఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, కలెక్టర్ కార్యాలయ ఎఒ ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్లు శ్రీరామ్మూర్తి, రమణమ్మ, రవి ఇతర సిబ్బంది పాల్గొని గాంధీకి నివాళులర్పించారు.

సీతంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి ఎంపిడిఒ కె.గీతాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గాంధీ జీవితంలో పాటించిన సత్యం, అహింస మార్గంలో అంతా నడవాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సత్యం, ఎఒ మానస, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో గాంధీజీ వర్ధంతి వేడుకలు ఆ గ్రామ ప్రజలు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధన దేశంలో సత్యం, అహింస మార్గాలు అని, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గులిపల్లి అప్పలనాయుడు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవనాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ బి.రామయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ చేసిన ఉద్యమాలు, పోరాటాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి భావి భారత పౌరులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధ, అధ్యాపకులు శ్రీవాణి, శ్రీలక్ష్మి , చిన్నారావు ఉన్నారు.



గాంధీ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న జెసి గోవిందరావు



గాంధీకి నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



బలిజిపేట : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్ఐబి మేనేజర్ కిరణ్

జనసేన టికెట్ రేసులో సహకార శాఖ అధికారి

ఉద్యోగానికి రాజీనామా

ప్రజాశక్తి - సాలూరు

జనసేన టికెట్ రేసులో సహకార శాఖ అధికారి ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే సీటు ఆశిస్తున్న ఆయన కొద్ది నెలల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం కూడా ఆయన రాజీనామాను ఆమోదించినట్లు సమాచారం. టిడిపితో పొత్తులో భాగంగా జనసేన సాలూరు అసెంబ్లీ సీటు కోరుతుందని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. టిడిపికి నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉన్నప్పటికీ గ్రూపు రాజకీయాలు కారణంగా జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే టికెట్ కావాలని ఆయన జనసేన అధిష్టానాన్ని కోరినట్టు తెలుస్తోంది. టిడిపి, జనసేన మధ్య పొత్తు ఖరారైందని ప్రచారం జరుగుతున్నా ఎన్ని సీట్లలో ఏ పార్టీ పోటీ చేస్తుందనే స్పష్టత ఇంత వరకూ లేదు. అయినా స్థానిక ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఎస్టీ గదబ సామాజిక వర్గానికి చెందిన ఆయన ఉన్నత విద్యావంతుడిగా గుర్తింపు వుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గిరిజన సంఘాలతో సత్సంబంధాలు కలిగి ఉన్న అధికారిగా ఆయనకు పేరుంది.



జిరాయితీ భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

జిరాయితీ భూమి పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పద్మాపురం పంచాయతీ కాగులగెడ్డ వద్ద పార్వతీపురం ఆర్‌డిఒ కె. హేమలత జిరాయితీ భూమిని మంగళవారం పరిశీలించారు. విశాఖపట్నంకు చెందిన దివీస్ లేబరేటరీ అనే ప్రైవేట్ కంపెనీ విశాఖపట్నంలో అటవీశాఖకు చెందిన కొంత భూమిని తీసుకోవడం జరిగింది. ప్రత్యామ్నాయంగా ఆ శాఖకు కాగులుగెడ్డ వద్ద జిరాయితీ భూమిని అప్పగించేందుకు 7 ఎకరాల 39 సెంట్లు జిరాయితీ భూమి బదలాయింపునకు తహశీల్దార్ ఎం.రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఆమె వెంట ఆర్ఐ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, విఆర్ఒ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ స్థలంపై కన్ను

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో స్థలాల విలువ విపరీతంగా పెరిగిపోయాయి. సెంటు స్థలం లక్షల్లో విలువ పలుకుతుంది. దీంతో కొంతమంది వ్యక్తులు ఖాళీ స్థలాలపై కన్నేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నా కాజేయడానికి వెనుకాడడం లేదు. విలువైన స్థలలాను అక్రమంగా తీసుకోవడానికి కొంతమంది వ్యక్తులు వెనుకాడడం లేదు. అధికారులు ఉదాసీనతతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. నగర పంచాయతీ పరిధిలో గల నాలుగో వార్డులో సర్వేనెంబర్ 19/1 లో నీలమ్మ కాలనీలో సామాజిక అవసరాలకు కేటాయించిన 5సెంట్ల స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకున్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై అధికారులు మాత్రం మొదట్లో స్పందించలేదు. అక్కడున్న స్థానికుల నుంచి తిరుగుబాటు రావడంతో అధికారులు స్పందించే పరిస్థితి కనబడుతుంది. ఈ స్థలం చేతులు మారినట్లు కూడా తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ వాసుల కోసం విడిచిన స్థలాన్ని కాపాడాలని అదికారులను కోరుతున్నారు. లేని పక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయం జరిగే వరకూ పోరాడతామని కాలనీ వాసులు చెబుతున్నారు. ఈ స్థలం వెనక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సంబంధించిన స్థలాన్ని కూడా కబ్జా చేసి గోడ నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఏరియా ఆస్పత్రి స్థలంలో నిర్మిస్తున్న గోడ

పరిశీలన చేస్తా : సర్వేశ్వర్రావు కమిషనర్

దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తానని కమిషనర్ సర్వేశ్వర్రావు అన్నారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చింది. వారి దగ్గరున్న పత్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.



ఉదయపురంలో ప్రచారం చేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

టిడిపి బలోపేతమే లక్ష్యం : వైరిచర్ల

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం పార్టీ బలోపేతమే ఏకైక లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నట్లు ప్రతి గ్రామంలో పర్యటిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ అన్నారు. మండలంలోని ఉదయపురం పంచాయతీలో గల ఉదయపురం, కొత్తూరు, దూళికుప్ప గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలన వల్ల ప్రజలు ఎలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో నేరుగా చూస్తున్నారని కావున రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ యువత, మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న మార్కెట్ ఆశీలు, షాపుల వేలం పాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారి మార్కెట్, మున్సిపల్ పరిధిలో గల పలు ఏరియాల్లో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూళ్ళు చేసుకొనేందుకు వేలం పాట ఫిబ్రవరి 9న ఉదయం 12 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ అధీనంలో ఉన్న మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22,34,36,44,45 నెంబర్ల షాపులు అద్దె ప్రాతిపదికన వేలంపాట వేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ ఆశీలు వేలం పాటలో పాల్గొనేవారు రూ.నిల్వలు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు రూ.4 లక్షలు ధరావత్తు మున్సిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాల కోసం కార్యాలయం పనిచేసే దినాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గ్రామీణ ప్రాంతాల్లో అక్కా చెల్లెమ్మల ఆర్థిక ప్రగతి లక్ష్యంగా ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమలు చేసిందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేటలో నిర్వహించిన వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత మండలం పరిధిలో మొత్తం 1154 సంఘాలకు గాను అందులో గల మొత్తం 12,632 మంది సభ్యులకు మొత్తం 4 విడతలుగా రూ.24.31 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అబిద్ జావెద్, ఎపిఎం పి.సురేష్, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి నాగమణి, ఎఎంసి చైర్‌పర్సన్ మరడాన భార్గవి, వైస్ ఎంపిపిలు సిద్ద జగన్నాధరావు, బంకురి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి - సీతంపేట

ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ టోర్నమెంట్లో సీతంపేట మండలం క్రీడాకారులు సత్తాచాటారు. బుధవారం నుంచి జరగబోవు జిల్లాస్థాయి ఆడుదామాంధ్ర టోర్నమెంట్‌కు ఎంపికైన ఈ జట్టు క్రీడాకారులను, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఎన్.జాకబ్‌దయానంద్‌ను ఎంపిడిఒ కె.గీతాంజలి అభినందించారు. దోనుబాయి సచివాలయం షటిల్ బ్యాట్మెంట్ సత్తా చాటారు. క్రికెట్లో ధారపాడు సచివాలయం, ఖోఖోలో గోయిది సచివాలయం జట్లు విజయం సాధించాయి. వాలీబాల్‌లో పుబ్బడ సచివాలయం జట్టు, బాలికల వాలీబాల్‌లో కడగండి సచివాలయం జట్టు విజయం సాధించారు. కబడ్డీలో కుసిమి సచివాలయం జట్టు విజయం సాధించారు. షటిల్ బ్యాట్మెంట్లో పులిపుట్టి సచివాలయం విజయం సాధించింది. వీరంతా మండల స్థాయి నుండి నియోజకవర్గం, అక్కడి నుంచి జిల్లా స్థాయికైనట్లు జాకబ్ దయానంద్ తెలిపారు బుధవారం నుండి జిల్లా స్థాయికి ఆడదాం ఆంధ్ర ఆడుతున్నట్లు తెలిపారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

కోట సీతారాంపురంలో జెఎఎస్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కోటసీతారాంపురంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహన్‌రావు వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ద్వారా వచ్చిన వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యమందించే వరకూ మందులు ఇవ్వడమే కాకుండా అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు కూడా పంపించనున్నట్టు తెలిపారు. అనంతరం తనిఖీ చేసి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, జి.సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తుమరాడకు చెందిన చాకరపల్లి ఈశ్వరరావు అనే వృద్ధ కళాకారుడికి మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈశ్వరరావు తన జీవితయాత్రలో అనేక రకాలైన పాత్రలు పోషించి వృద్ధ కళాకారుడిగా పేరు తెచ్చుకోవడమే కాకుండా పిల్లలకు దేశభక్తి గీతాలు నేర్పిస్తూ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, సుమారు 2 వేలు ప్రదర్శనలు చేస్తూ 4వేల సన్మానాలు పొంది ఒక కళాకార వృత్తికే వెన్ను తెచ్చిన కళాపోషకుడుగా మారారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.జయ ప్రసాద్, పి.శ్రీనివాస్, ఎ.అజయ్‌ప్రసాద్, గణేష్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కళాకారుడ్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



లబ్ధిదారునికి ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నెరవేరిన పేదల సొంతింటి కల

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పేదల సొంత ఇంటి స్థలం కలను నెరవేర్చింది వైసిపి ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో గల 5,6,7వ వార్డు సచివాలయాల పరిధిలో గల వార్డులకు చెందిన పేదలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో నర్సిపురం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ రద్దు కావడంతో అందులో ఇళ్ళ స్థలాలు వచ్చిన అర్హులంతా వెంకంపేట వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో స్థలాలను కేటాయించి వారందరికీ మళ్లీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు తాడ్డి శంకరరావు, గెంబలి మురళీకృష్ణ, వి.నేతాజీ, జె.దివ్య, ఎన్.సుధీర్, ఆర్.చిన్నం నాయుడు, సచివాలయ కన్వీనర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ తాగునీటి సరఫరాకు సంబంధించిన వాటర్ వర్క్సులో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ అకస్మాత్తుగా మరమ్మతుకు గురవ్వడంతో మంగళవారం నీటి ట్యాంకులకు పంపింగ్ జరుగలేదని కమిషనర్ జయరాం చెప్పారు. దీంతో బుధవారం పట్టణంలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు గ్రహించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సుప్రీంకోర్టు తీర్పు వైసిపికి చెంపపెట్టు : టిడిపి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో టిడిపి శ్రేణులతో కలిసి మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలిందని చంద్రబాబు నాయుడు వేసిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్ సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. న్యాయమే గెలిచిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ఇకనైనా జగన్‌రెడ్డి అండ్ కో సిగ్గుపడాలని, ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు మానుకోవాలని ఆమె అన్నారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చు కానీ ఖచ్చితంగా గెలుస్తుందని ఆమె పేర్కొన్నారు. దేశంలో మహిళలపై నేరాల్లో ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉందని, రాష్ట్రంలో ప్రతిరోజు కనీసం 70 కేసులు నమోదు అవుతున్నాయని, నేరాల్లో వరకట్న వేధింపులు, హత్యాచారాలు, ఆత్మహత్య, లైంగిక వేధింపులు ముఖ్యంగా ఉన్నాయని ఆమె అన్నారు. అలాగే రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రైతుల రుణభారం ఎపి రైతులపై ఎక్కువగా ఉందని ఆమె తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం జరుగనుంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని కమిషనర్ టి.జయరాం ఒక ప్రకటనలో కోరారు.

పారిశ్రామిక శిక్షణను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థులు పారిశ్రామిక విద్యపై ఆసక్తి కనబరిస్తే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు వీలుంటుంది కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని భద్రగిరి ఆర్‌ఐటిఐలో ప్లంబర్ ల్యాబ్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. స్థానికంగా ఉంటూ చదువుకోవడానికి సాంకేతిక విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్లంబర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ కమల్ వెల్ఫేర్ స్వచ్ఛంద సేవా సంస్థ (విశాఖపట్నం) సహకారంతో రూ.ఐదు లక్షలతో ఎపి ఎస్ ఎస్ డి సి కోఆర్డినేటర్ శ్రీ సాయి ప్లంబర్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కావున యువత ప్లంబర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్కు ప్రారంభం

మన్య ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని ఎస్ కె పాడు సమీపాన నిర్మించిన అడ్వెంచర్ పార్కును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ పార్కు పర్యాటకులకు ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. కుటుంబ సమేతంగా వచ్చి సంతోషంగా గడపడానికి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్, ఎంపిపి దీనమయ్య, జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచులు ఆర్.చైతన్య స్రవంతి, గౌరీ శంకర్రావు, అధికారులు పాల్గొన్నారు.



పార్కులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పిఒ విష్ణుచరణ్

నాసిరకం హెల్మెట్లు అమ్మితే చర్యలు : ఆర్‌టిఒ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఐఎస్‌ఐ ప్రమాణాల్లేని నాసిరకం హెల్మెట్లు ధరించినా, అమ్మినా చర్యలు ఉంటాయని జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జునరెడ్డి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సహకారంతో 400 మంది డ్రైవర్లకు నేత్ర పరీక్షలు, బిపి, షుగరు పరీక్షలు, శారీరక ధృడ పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం, ద్విచక్ర వాహనదారులంతా విధిగా ఐఎస్‌ఐ ఆమోదం పొందిన మార్క్‌తో కలిగిన హెల్మెట్‌ను మాత్రమే ధరించి వాహనాలు నడపాలన్నారు. ఆమోదం పొందిన మార్క్‌తో కలిగిన హెల్మెట్‌ను ధరించకుండా, ఎటువంటి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపి జిల్లా రవాణా, పోలీస్ శాఖ చేయు తనిఖీల్లో పట్టుబడితే అపరాధ రుసుములను విధిస్తామన్నారు. అంతేకాక మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవిఐ, ఎఎంవిఐలో వాహన డ్రైవర్లకు ఆరోగ్యం, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్, ఇతర రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవిఐ శశికుమార్, ఎఎంవిఐ సత్యనారాయణ, ఎఒ సీతారాం, జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ పి.నారాయణరావు, నేత్ర వైద్యులు డా.వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటరమణ, రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, ట్రాన్స్పోర్ట్ కానిస్టేబుల్, హోం గార్డ్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి

గాంధీ ఆశయాలను నెరవేర్చాలి

రెడ్ క్రాస్ యూనిట్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి - బలిజిపేట

దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిపెట్టి జాతి గౌరవాన్ని కాపాడిన బాపూజీ గాంధీజీ కన్న కలలు ఆశయాలు నెరవేరాలంటే బాలలు క్రమశిక్షణతో మెలిగి ఆయన ప్రధాన ఆయుధాలైన అహింస, సత్యాగ్రహాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రెడ్‌క్రాస్ రాజాం యూనిట్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ అన్నారు. బాపూజీ వర్థంతి సందర్భంగా మండలంలోని వంతరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధులకు స్ఫూర్తినిచ్చేలా గాంధీజీ మెలిగి మహాత్మా అనే బిరుదు సాధించారన్నారు. అనునిత్యం గాంధీజీ ఆశయాలు రూపుదిద్దుకొనేలా బాలల మెలగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారావు మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలు మంచి అలవాట్లు నేర్చుకుని స్నేహపూర్వక వాతావరణంలో పెరగాలని విద్య పట్ల మాత్రమే పోటీ తత్వం ఉండాలని హింసను ప్రేరేపించకూడదని అన్నారు. గాంధీజీ అహింస అనే సూత్రం ద్వారా దేశానికి స్వాతంత్రం తెచ్చి పెట్టారన్నారని ఉపాధ్యాయులు కృష్ణారావు, అప్పలస్వామి తెలిపారు. గాంధీజీ విగ్రహానికి వేదిక నిర్మించేందుకు సహకరించిన పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ వారాడ అప్పలనాయుడు, జగన్నాధరావును పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కో-కన్వీనర్ పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, కొల్లూరు తిరుమలేశ్వరారావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్‌క్రాస్ యూనిట్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్



పారిశ్రామిక పరిశీలనలో పాల్గొన్న విద్యార్థులు

వస్తు ఉత్పత్తి కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - భామిని

వృత్తి నైపుణ్య శిక్షణలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం అపారల్ మేడ్ అప్ ఇండస్ట్రీయల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఘనసారలో శ్రీ విశాఖ గ్రామీణ బ్యాంకు వారి కలాం ప్రైమరీ కంప్యూటర్ శిక్షణ కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం, భామిని సచివాలయాన్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలనను విద్యార్థికి ఆసక్తితో, పూర్తి స్థాయి అవగాహన కలుగుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ అన్నారు. కార్యక్రమంలో ఐటి అండ్ ఐటిసి విభాగం నుంచి సిహెచ్ హరి ప్రసాద్ రావు, ఎం.వరలక్ష్మి ఉన్నారు.

చినకుదమలో జయహో బిసి

ప్రజాశక్తి - కురుపాం



వైసిపి ప్రభుత్వంలో బీసీలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామరాజు అన్నారు. జియ్యమ్మ వలస మండలం చినకుదమలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శత్రుచర్ల మాట్లాడుతూ బిసి మహిళలకు అన్యాయం జరిగితే కనీసం ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని ఇటువంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో తెదేపా, జనసేన కూటమిని కచ్చితంగా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి .జగదీశ్వరి, అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ,బీసీ నాయకులు, టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రంలోని స్థానిక సచివాలయంలో స్వచ్ఛ వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి, వైద్యాధికారుల వైసిపి నాయకుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రతిజ్ఞ నిర్వహించి అనంతరం స్పర్శ కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. గాంధీ వర్థంతి సందర్భంగా కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ, వ్యాధి కారణానికి గల లక్షణాలను వివరించారు. ఈ సందర్భంగా ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కర్ణ, నాని, పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి, వైసిపి నాయకులు బండారు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని విపి రాజుపేట సెంటర్ దగ్గర సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో కె.అనిల్‌కు గాయాలయ్యాయి. వీరఘట్టం మండలం నర్సిపురానికి చెందిన అనిల్ పాలకొండలో పని ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొంది. అయితే కారును అక్కడే వదిలేసి డ్రైవర్‌తో పాటు మిగిలిన వారు పరారయ్యారు. ఎస్ ఐ ప్రశాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపిపి బి.రమణమ్మ అన్ని శాఖల పనితీరును సమీక్షించారు. తొలుత వ్యవసాయ శాఖ ఎఒ ఎస్ అవినాష్ మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యాన్ని సేకరించామన్నారు. 53,232 మంది రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి ఈనెల 24 వరకు బిల్లులు చెల్లించామన్నారు. బిల్లులు పెండింగ్‌లో లేవన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ నుంచి వైద్యాధికారి పావని తమ శాఖ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎంఇఒ జి.సూరిదేముడు నాడు-నేడులో జరిగిన పనుల కోసం వివరించారు. అంగనవాడీ సూపర్వైజర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారం వివరించారు. ఎపిఎం ఆర్.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ నాలుగో విడత ఆసరా 1140 గ్రూపులకు రూ.ఆరు కోట్ల 86 లక్షలు అందించామన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రమణమ్మ

సిబ్బంది పనితీరుపై ఎంపిడిఒ ఆగ్రహం

ప్రజాశక్తి -బలిజిపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఎంపిడిఒ కె.విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సుమారు 11.30 గంటల సమయంలో ఎంపిడిఒ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి తిరిగి కార్యాలయానికి వచ్చే సమయంలో ఒక్క ఉద్యోగి కూడా కార్యాలయంలో ఉండకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్ కార్యాలయానికి వచ్చి వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లడం సరైన పద్ధతి కాదని, బయటకు వెళ్లేటప్పుడు ఎంపిడిఒ అనుమతి తీసుకోవాలని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది టైపిస్ట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ విక్టరీ అనుమతి తీసుకొని బయటకు వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ తనకు సమాచారం ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని ఎంపిడిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కొంత మంది సిబ్బంది రికార్డుల్లో గత మూడు, నాలుగు రోజులుగా సంతకాలు పెట్టకపోవడాన్ని చూసి ఎంపిడిఒ వాటిని ఆబ్‌సెంట్‌గా మార్కు చేయడం కొసమెరుపు. దీన్నిబట్టి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు రోజు విధులకు వస్తూ సంతకాలు రికార్డుల్లో చేయకపోవడం ప్రశ్నార్థకంగా మారిందని, నిజంగా వీరు విధులకు వస్తున్నారా లేదా అన్న అనుమానాలు తేటతెల్లంగా కనిపిస్తున్నాయి.



అటెండెన్స్ రికార్డును పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయలక్ష్మి